క్లుప్తంగా

మరుగుదొడ్డి తప్పనిసరి



ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలు, జగనన్న వ్యక్తిగత ఇళ్ల వద్ద కచ్చితంగా మరుగుదొడ్లు నిర్మిస్తామని జగన్నాథపురం గ్రామస్తులు సోమవారం ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ బొద్దల పద్మా సత్యనారాయణ, హౌసింగ్ సిబ్బంది కలసి గ్రామస్తులకు మరుగుదొడ్ల ఆవశ్యకతను వివరించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే రోడ్ల అభివృద్ధి



రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

బొబ్బిలి: పట్టణంలోని రహదారుల నిర్మాణాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే జోరందుకున్నాయని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అన్నారు. పట్టణంలోని 16వ వార్డు బజారు మెయిన్‌రోడ్డు, గొల్లపల్లి 11వ వార్డుల్లో నిర్మిస్తున్న రహదారుల నిర్మాణాలను కౌన్సిలర్లతో కలసి సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బాబు, ఉమ, గోవింద, కోఆప్షన్ మెంబర్ సత్యారావు, దిబ్బ గోపి, డీఈఈ రవికుమార్, తదితరులున్నారు.

టీడీపీ నాయకులపై ఫిర్యాదు



ఎస్సై జయంతికి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యులు

బాడంగి: శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ నాయకులు చంద్రబాబునాయుడు, లోకేష్‌లపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ రెడ్డి జగదీష్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో పలువురు సోషల్ మీడియా సభ్యులు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జయంతికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సభ్యులు మరిపి శంకరరావు, వై.కొండలరావు, వై.రమేష్, వై.శ్రీను, జి.గణేష్, వై.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'ను వినియోగించుకోండి..

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మన కుటుంబ వైద్యుడు (ఫ్యామిలీ డాక్టర్) కార్యక్రమాన్ని ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని తెర్లాం పీహెచ్‌సీ డాక్టర్ రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించిన పలువురు రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఏ వై.శ్రీదేవి, సచివాలయ ఏఎన్‌ఎం ప్రశాంతి, 104 వాహన సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్త యామల శ్రీదేవి పాల్గొన్నారు.


పరామర్శ



పార్వతమ్మను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

రేగిడి: మండలంలోని పుర్లి వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు కురిటి పార్వతమ్మను ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆమె పలు ఆస్పత్రుల్లో చేరి చికిత్స చేయించుకున్నారు. ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. వారి వెంట కురిటి రామకోటి, వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, పార్టీ మండల విప్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. .

ఈ నెలాఖరులోగా స్టోన్ ప్లాంటేషన్ పూర్తి



మాట్లాడుతున్న జిల్లా నోడల్ ఆఫీసర్ వెంకటరావు

బాడంగి: భూముల రీ సర్వే జరిగిన గ్రామాలలో ఈ నెలఖరులోగా స్టోన్ ప్లాంటేషన్ పనులు పూర్తి చేస్తామని జిల్లా నోడల్ అధికారి చౌదరి వెంకటరావు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని 27 మండలాల్లో 983 గ్రామాలుండగా 3,64,420 సర్వేరాళ్లు పాతడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇందుకోసం 8 మంది ప్రత్యేక అధికారులు, 27 మంది మండల సర్వేయర్లను నియమించామన్నారు.

పేద విద్యార్థులకు విద్యాదీవెన వరం

- తల్లుల ఖాతాలో నగదు జమ
- బొబ్బిలి నియోజకవర్గంలో 7,349 మంది విద్యార్థులకు లబ్ధి
- రాజాం నియోజకవర్గంలో 6,933 మందికి సాయం
- ఆనందం వ్యక్తం చేస్తున్న విదార్థుల తల్లిందండ్రులు



బొబ్బిలి ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు (ఫైల్)

రామభద్రపురం: పేద విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పథకం వరంగా మారింది. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తూ జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాలను ప్రవేశపెట్టారు. ఫలితంగా పేద విద్యార్థులు నిశ్చింతంగా చదువు సాగిస్తున్నారు. జగనన్న విద్యాదీవెన కింద ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్, తదితర విద్యా కోర్సులను అభ్యసించే పేద విద్యార్థులకు ప్రభుత్వమే ఆయా కోర్సుల ఫీజులను చెల్లిస్తోంది. ఏటా రెండు విడతల్లో ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్, తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20 వేలు చొప్పున్న ఆర్థిక సాయం అందజేస్తున్నారు. 2022 –23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సోమవారం విద్యాదీవెన నిధులు మంజూరు చేశారు. దీంతో బొబ్బిలి నియోజకవర్గంలో 7,349 మంది ప్రయోజనం పొందుతున్నారు. ఇందులో రాభద్రపురం మండలంలో 1245 మంది, బొబ్బిలి రూరల్‌లో 1886 మంది, బొబ్బిలి అర్బన్‌లో 1330 మంది, తెర్లాం మండలంలో 1599 మంది, బాడంగి మండలంలో 1289 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరింది.

రాజాం: జగనన్న విద్యా దీవెన మూడో విడతలో భాగంగా నియోజకవర్గంలో 6933 మంది విద్యార్థులకు సంబంధించి రూ.4,57,26,965లను వారి తల్లుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. తొలివిడతలో 5943 మంది, రెండో విడతలో 6435 మంది విద్యార్థులు ఈ పథకం కింద లబ్ధి పొందగా.. మూడో విడతలో లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగింది.



రాజాంలో ఐటీఐ కళాశాల విద్యార్థులు.

విద్యాదీవెనతో ఉన్నత చదువు



రాజాం: ఈ ఫొటోలోని విద్యార్థిని పేరు గాడి కళ్యాణి. రాజాం మండలం మారేడుబాక గ్రామానికి చెందిన ఈమె తల్లిదండ్రులు చిన్నమ్మడు, తిరుపతిరావు రోజువారీ వ్యవసాయ కూలీలు. ఇంటర్ పూర్తయ్యాక తమ కుమార్తె చదువు నిలుపుదల చేద్దామని అనుకున్నారు. అప్పటికే జగనన్న విద్యాదీవెన ఈ విద్యార్థికి అందుతుండడంతో డిగ్రీ పూర్తి చేయిద్దామని రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేర్పించారు. విద్యాదీవెన కింద ఏడాదికి రూ.20 వేలు అందుతున్నాయి. వాటితో నోటు పుస్తకాలు, యూనిఫాం, పోటీపరీక్షల పుస్తకాలు కొనుగోలు చేసి చదువుకుంటోంది. ప్రస్తుతం రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఇంటర్న్‌షిప్ చేస్తోంది. ఈ ఏడాది కూడా జగనన్న విద్యాదీవెన అందడంతో ఆమె ఆనందం వ్యక్తం చేసింది. జగనన్న అందించిన సాయంతోనే తన చదువు పూర్తిచేశానని అంటోంది.

జగనన్న మేలు మరువలేను..



రాజాం జీసీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుకున్నాను. మా తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ నన్ను ఇంటర్మీడియట్ వరకు చదివించారు. డిగ్రీ చదివేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వచ్చింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న విద్యాదీవెన పథకం నేను డిగ్రీ చదివేందుకు ఎంతగానో ఉపయోగపడింది. ఆయన చేసిన మేలు ఎన్నటికీ మరువలేను.

–శనపతి భాగ్యలక్ష్మి, రంగప్పవలస, తెర్లాం మండలం

మూడేళ్లుగా...



నాకు ఇద్దరు సంతానం. పెద్ద పాప సంధ్య డిగ్రీ చదివి రిలీవ్ అయ్యింది. ఈ పాపకు ఆఖరి ఏడాదిలో విద్యాదీవెన పడింది. ఇప్పుడు రెండో పాప చిన్నమ్మలు డిగ్రీ మూడో ఏడాది చదువుతోంది. మూడేళ్లుగా విద్యాదీవెన డబ్బులు పడుతున్నాయి. నా భర్త మరణించడంతో పిల్లల చదువు నాకు భారంగా మారింది. ఈ సమయంలో విద్యాదీవెన అండగా నిలిచింది.

– చొక్కాపు మంగమ్మ, విద్యార్థిని తల్లి, రామభద్రపురం

జగనన్నకు కృతజ్ఞతలు..



డిగ్రీ ఫైనలియర్ చదివి ఇటీవల రిలీవ్ అయ్యాను. నేను చదివిన మూడేళ్లు విద్యాదీవెన నిధులు మా అమ్మ ఖాతాలో పడ్డాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యాదీవెన పథకం మాలాంటి పేద విద్యార్థులకు ఓ వరం. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి, పేద విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు కృతజ్ఞతలు.

– సీహెచ్ భవానీ, విద్యార్థిని, రామభద్రపురం

ఎంబీఏ చదువుతున్నా..



జగనన్న విద్యాదీవెన పథకంలో ప్రస్తుతం ఎంబీఏ చదువుతున్నా. గుంటూరులో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ప్రస్తుతం ఏయూలో ఎంబీఏ చేస్తున్నా.. మాలాంటి నిరుపేదలకు ఈ పథకం ఎంతో అండగా నిలుస్తోంది. థ్యాంక్స్ టు జగనన్న..

– యామాల సుష్మిత, చినభీమవరం, బాడంగి మండలం

సద్వినియోగం చేసుకుంటున్నాను



జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా గతేడాది రూ.20 వేలు మా అమ్మ బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. ఇంజినీరింగ్ విద్యకు సంబంధించి కొన్ని వస్తుసామాగ్రి కొనుగోలుచేశాను. ఈ ఏడాది కూడా ఈ పథకం వర్తించింది. నా చదువుకు అయ్యే బయట ఖర్చులు ఈ నగదుతో ఒడ్డెక్కుతున్నాయి.

– రాజాపు అభిషేక్, ఇంజినీరింగ్ విద్యార్థి, జీఎంఆర్ఐటీ, రాజాం

సక్రమంగా అందుతున్నాయి



జగనన్న విద్యాదీవెన నిధులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నేరుగా మాకు అందుతున్నాయి. డిగ్రీలో మంచి పుస్తకాలు, యూనిఫాం దుస్తులు వంటివి కొనుగోలు చేసేందుకు ఇవి చాలా ఉపయోగపడ్డాయి. ఇంటి వద్ద తల్లిదండ్రులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉన్నత చదువులు అభ్యసించేందుకు విద్యాదీవెన నిధులు ఆసరాగా నిలుస్తున్నాయి.

– శాసుబిల్లి సౌజన్య, డిగ్రీ విద్యార్థి, ఉప్పర్నాయుడువలస, రేగిడి మండలం

చాలా ఆనందంగా ఉంది



నా ఉన్నత చదువులకు జగనన్న విద్యాదీవెన పథకం ఎంతో ఉపయోగపడుతోంది. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు రెండు విడతలుగా ఆర్థిక సాయాన్ని పొందాను. మంచి పుస్తకాలు కొనుక్కొనేందుకు, పోటీ పరీక్షలకు తర్ఫీదు పొందేందుకు ఈ డబ్బులు ఉపయోగపడుతున్నాయి.

– వజ్జిపర్తి తవిటయ్య, డిగ్రీ విద్యార్థి, ప్రభుత్వ కళాశాల, రాజాం

గడప గడపకూ సంక్షేమం..

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



రంగప్పవలసలో సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: పార్టీలకతీతంగా గడప గడపకూ సంక్షేమ పథకాలు అందించడం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రంగప్పవలస, తమ్మయ్యవలస గ్రామాల్లో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శనపతి రాంబాబు, గ్రామస్తులు ఎమ్మెల్యే, తదితరులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. నాలుగేళ్ల కాలంలో ఒక్కో ఇంటికి సంక్షేమ పథకాల వల్ల కలిగే లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎటువంటి సిఫార్సులు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరవుతున్నాయని చెప్పారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను సీఎం జగనన్న అమలు చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ప్రజలంతా సీఎం జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి, తెర్లాం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, నర్సుపల్లి బాబ్జీరావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు లూర్థు రామారావు, సర్పంచ్ రాంబాబు, సర్పంచ్‌ల సంఘ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఉప తహసీల్దార్ భాస్కరరావు, ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కంబాల జోగులు
- రాజాంలో ఆహా క్యాంటీన్ ప్రారంభం



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆహా క్యాంటీన్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తక్కువ ధరకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని క్యాంటీన్ నిర్వాహకులకు సూచించారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు స్త్రీనిధి, పీఎంఈజీపీ ద్వారా ప్రభుత్వం రుణాలు అందిస్తోందని, వాటిని డ్వాక్రా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెప్మా టీఎంసీ రత్నం మాట్లాడుతూ.. కొంతమంది మహిళా సంఘాల సభ్యులు ఈ క్యాంటీన్ నిర్వహణకు ముందుకు వచ్చారన్నారు. ప్రస్తుతం రూ.30లకే వెజ్ బిర్యాణి, వెజ్ ఫ్రైడ్ రైస్, పులిహోరా విక్రయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడులు, వంజరాపు విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, ఓలేటి గణపతి, యందవ చినబాబు, పార్టీ ప్రధాన కార్యదర్శి రాజుమాస్టారు, కోల్లా రమ్య, యందవ సుశీల, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ నాగరాజు, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

సోదర సౌభ్రాతృత్వానికి ప్రతీక రాఖీ పండుగ

- ఎమ్మెల్యే శంబంగి



ఎమ్మెల్యే శంబంగి క్యాంపు కార్యాలయంలో రాఖీ వేడుకలు

బొబ్బిలి: ప్రజలందరూ సోదర సౌభ్రాతృత్వంతో కలసి మెలసి జీవించేందుకు ప్రతీకగా రాఖీ పండుగ నిలుస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శంబంగి, తదితరులకు బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం బొబ్బిలి బ్రాంచి ఇన్‌చార్జ్ బీకే రాజేశ్వరి ఆధ్వర్యంలో పలువురు రాఖీలు కట్టారు. అలాగే డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ పుల్లారు శ్రీధర్‌కు, సీఐ కార్యాలయంలో సీఐ ఎం. నాగేశ్వరరావుకు, రాష్ట్ర ఆర్థిక మండలి మాజీ సభ్యుడు తూముల భాస్కరరావుకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, తదితరులున్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ



దర్యాప్తు చేపడుతున్న శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ శృతి

బూర్జ: మండలంలోని గుత్తావల్లికి చెందిన సనపల సురేష్‌కుమార్‌పై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వై.శృతి సోమవారం విచారణ చేపట్టారు. గుత్తావల్లికి చెందిన గ్రీన్ అంబాసిడర్ యలగాడ జగన్నాథంపై సురేష్‌కుమార్ శనివారం దాడి చేసినట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గ్రామంలో పలువురుని విచారించినట్లు డీఎస్పీ తెలిపారు. ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి జగన్నాథం తనపై దాడి చేశారని సురేషకుమార్ ఫిర్యాదు చేశారని ఎస్ఐ బి.అశోక్‌బాబు సోమవారం తెలిపారు. ఇరువైపులా ఇచ్చిన కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

'స్పందన'వినతులకు ప్రాధాన్యం



స్పందన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు



అర్జీదారుడి నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

- ఎంపీడీఓ ఆంజనేయులు

బాడంగి: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో వచ్చిన వినతులకు ప్రాధాన్యం ఇచ్చి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారులు తెలియజేసే సమాధానం, పరిష్కారంతో ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందాలన్నారు. గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ అప్పయ్య, ఏఈ సత్యం, ఎంఈఓ రాజేశ్వరి, ఏపీఎం భాగ్యలక్ష్మి, ఏపీఓ విజయకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్, ఏఓ శిరీష,హెల్త్ సూపర్‌వైజర్ గోపాలనాయుడు, వెటర్నరీ సహాయకురాలు శిరీష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పరిష్కరించాలి

తెర్లాం: జగనన్నకి చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయానికే రేషన్ సరుకులు

- తహసీల్దార్ రాజేశ్వరరావు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రతి నెలా అందజేస్తున్న బియ్యం, చక్కెర, తదితర నిత్యావసర సరుకులు నిర్ణీత సమయానికే అందించాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పట్టణ, మండల రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండీయూ ఆపరేటర్లు వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. జాతీయ ఆహార భద్రత కింద ప్రజలందరికీ ఆహారాన్ని అందజేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్న విషయాన్ని గ్రహించాలన్నారు. సమావేశంలో పౌరసరఫరాల ఉప తహసీల్దార్ ఆర్. సాయికృష్ణ, తదితరులున్నారు.

సక్రమంగా ఓటరు సర్వే దరఖాస్తులు..

ఎలక్షన్ కమిషన్ ఆదేశాల ప్రకారం నిర్వహిస్తున్న ఇంటింటి ఓటరు సర్వేలో వచ్చిన క్లయిమ్‌లను అవసరమైన ఎన్‌క్లోజర్స్‌తో సక్రమంగా పూరించి సిద్ధం చేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు వీఆర్వోలను ఆదేశించారు. వీఆర్‌ఓలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇంటింటి సర్వే వివరాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఉప తహసిల్దార్ బలివాడ గౌరీశంకర్ సర్వే డీటీ జి. అప్పయ్య, ఆర్ఐ కల్యాణ చక్రవర్తి, తదితరులున్నారు.

సంక్షిప్తంగా...

మట్టి గణపతులే మేలు..

బొబ్బిలి: రానున్న వినాయక చవితి ఉత్సవాల్లో భక్తులు పూజించేందుకు మట్టి గణపతులనే వినియోగించాలని జనవిజ్ఞాన వేదిక మండల కార్యవర్గ సభ్యుడు ఎస్. శ్రీనివాసరావు, వనమిత్ర అధ్యక్షుడు కె. కృష్ణదాసు అన్నారు. మండలంలోని అలజంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించి, మట్టి వినాయక తయారీపై శిక్షణ ఇచ్చారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

బొబ్బిలి: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వచ్చే నెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి టి. వాసుదేవన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇందుకు అన్ని ప్రభుత్వ శాఖలు, కక్షిదారులు, న్యాయవాదులు సహకరించాలన్నారు. అన్ని సివిల్ కేసులు, రాజీకాదగ్గ క్రిమినల్ కేసులు, బ్యాంక్ తగాదాలు, ప్రి లిటిగేషన్ కేసులను పరిష్కరిస్తామన్నారు.

సకాలంలో వేతనాలు చెల్లించాలి

తెర్లాం: గ్రామాల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు సకాలంలో గౌరవ వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లోని చెత్త శుద్ధి నిర్వహణ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు చురుగ్గా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ రాంబాబు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కారించాలి

వంగర: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. అనంతరం గ్రామాల వారీగా స్పందనలో వచ్చిన వినతులపై సచివాలయ ఉద్యోగులతో సమీక్షించారు. అలాగే సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలని, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని సూచించారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు

రేగిడి: మండలంలోని బూరాడ, మునకవలస, కొర్లవలస, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లుకు సోమవారం మరమ్మతులు చేశారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడకుండా బోర్లను బాగుచేయించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ తెలిపారు. పంచాయతీ సర్పంచ్‌ల పర్యవేక్షణలో తాగునీటి సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు.

అభివృద్ధి పనుల పరిశీలన

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు సోమవారం పరిశీలించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద కేటాయించిన రూ.20 లక్షల గ్రామ సచివాలయ నిధులతో గ్రామ శివారు వీధుల్లో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మురుగుకాలువలు, సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు.

నూతన బోధనా పద్ధతులు అనుసరించాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన బాగుండాలని ఎంఈఓ బి.ఎరకయ్య ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని చాటాయివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల బోధనపై ఆరాతీశారు. నూతన పద్ధతులలో బోధన చేయాలని సూచించారు. హెచ్‌ఎం శాసపు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు శ్రీధర్‌రావు, చిన్నారావు ఉన్నారు.

ఎరువుల నాణ్యత పరిశీలన

సంతకవిటి: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో విక్రయిస్తున్న ఎరువులను మండల వ్యవసాయాధికారి పైల నవీన్ సోమవారం తనిఖీ చేశారు. శాంపిల్స్ సేకరించి నాణ్యతా పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. రైతులకు ఎంఆర్‌పీ ధరలకే ఎరువులు అమ్మాలని, కొనుగోలు చేసిన వారికి తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని దుకాణ యజమానులకు సూచించారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయించినా, రశీదులు ఇవ్వకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

రాజాం: స్పందన అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. 'జగనన్నకు చెబుదాం'లో వచ్చిన ఫిర్యాదులపై ఆరాతీశారు. పంచాయతీల వారీగా అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అన్ని గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

తెర్లాం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఆర్‌సీఎం విశాఖపట్నం మైత్రాసనం సామాజిక సేవల సొసైటీ (వీడీఎస్ఎస్ఎస్), కోల్పింగ్ ఇండియా డైరెక్టర్ ఫాదర్ సుధాకర్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌సీఎం ఫాదర్ సంతోష్‌కుమార్, కోల్పింగ్ కో ఆర్డినేటర్ యుగంధర్ ఆధ్వర్యంలో కోల్పింగ్ ఇండియా వారి సౌజన్యంతో మండల స్థాయిలో పరిసరాలను పరిరక్షించండి-పచ్చదనాన్ని కాపాడండి అన్న నినాదంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

